వీఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో తరగతుల ప్రారంభం

జగిత్యాల, నవంబర్ 27 : జిల్లా కేంద్రానికి సమీపంలోని డాక్టర్ వీఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బుధవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా రహ్మాన్ షరీఫ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్‌లో వీఆర్‌కే కళాశాలలో 70 సీట్లకు గాను, 50 మంది విద్యార్థులు సీట్లు పొందారు. డైరెక్టర్ రామకృష్ణ దండు, డాక్టర్ పీ శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మీర్ కాజిమ్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల నిర్వాహకుడు షరీఫ్

బీసీల రాజ్యాధికారం కోసం అన్ని పార్టీల మద్దతు అవసరం

- ఎమ్మెల్సీ కవితపై విమర్శలు చేస్తే సహించేదిలేదు
- యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్

తెలంగాణచౌక్, నవంబర్27: అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలంటే అన్ని రాజకీయపార్టీల మద్దతు అవసరమని యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు గుంజపడు హరిప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ముఖ్యనాయకులతో సమావేశమై, మాట్లాడారు. కొంత మంది బీసీ నాయకులు తమ స్వార్థప్రయోజనాల కోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. బీసీ హక్కుల కోసం మద్దతు తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల నాయకులతో సభలు, రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవితను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరిగిందని అనడం హాస్యాస్పదంగా ఉందని, ఆరోపణలు చేసేముందు నిజానిజాలు తెలుసుకోవాలని జాజుల శ్రీనివాస్ గౌడ్‌కు సూచించారు. గత ప్రభుత్వంలో బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలను ఏర్పాటు చేయడమే కాకుండా కుల వృత్తులకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కవిత బీసీ కాకపోయినా బీసీల స్థితిగతులను తెలుసుకొని ఒక ఉద్యమనాయకురాలిగా బీసీలకు మద్దతుగా ముందుకువస్తే స్వాగతించాల్సిందిపోయి విమర్శలు చేయడం అవగాహనా రాహిత్యమన్నారు. బీసీల బలోపేతం కోసం మద్దతుగా ముందుకు వచ్చే వారిది ఏ వర్గం అనేది ముఖ్యంకాదని, సామాజిక కోణంలో ఆలోచించాలే తప్ప వ్యతిరేకించడం తగదని హితవు పలికారు. సమావేశంలో రాష్ట్ర జిల్లా ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- చింతకుంట స్కూల్ హెచ్ఎం శోభారాణి
- సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

కొత్తపల్లి, నవంబర్ 27: విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో రాణించినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చింతకుంట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టీ శోభారాణి పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాల బాలికలకు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ మాటాడుతూ సాఫ్ట్ బాల్ క్రీడ ఒలింపిక్స్ గేమ్స్‌లో ప్రధానమైనదని, దీనికి వీపరితంగా క్రేజ్ ఉందన్నారు. క్రీడాకారులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కరీంనగర్ పేట టీఎస్ అధ్యక్షుడు అంతడుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఇక్కడ పెద్దపల్లి జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, పేట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమురోజు కృష్ణ, కరీంనగర్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.శ్రీను, కరీంనగర్ పేట టీఎస్ కార్యదర్శి ఎండీ యూనిష్ పాషా, వ్యాయామ ఉపాధ్యాయులు ఆడెపు శ్రీనివాస్, వీరన్న, శంకరయ్య, రాజ్ కుమార్, మహేశ్, సంతోష్, రాజబాబు, రజనీ, సౌజన్య, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని శోభారాణి

శిక్షణ పొందిన కానిస్టేబుల్‌పై కేసు

జమ్మికుంట, నవంబర్27: ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో శిక్షణ పొందిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు.. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజేశ్ స్వీటు వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాడు. షాపునకు ఎదురుగా ఎండీ రహీం గ్యాస్ స్టావ్‌లు రిపేర్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రహీంకు 2024 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా శిక్షణ పొందిన కొడుకు ఎండీ సోహెల్ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో గత దీపావళి రోజున రాజేశ్ పటాకులు కాల్చుకునే సమయంలో రహీం కొడుకు సోహెల్ బెదిరింపులకు గురి చేశాడు. అంతేకాకుండా బుధవారం సోహెల్ అకస్మాత్తుగా రాజేశ్ షాపు ముందుకు వచ్చి దూషిస్తూ కొట్టాడు. రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ప్రజారోగ్యంపై కాంగ్రెస్‌కు పట్టింపులేదు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల/ మారుతీనగర్, నవంబర్ 27 : ప్రజారోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విమర్శించారు. గత బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేసి ప్రజల్లో నమ్మకం పెంచిందని, ఇప్పుడు నమ్మకాన్ని పోగొట్టవద్దని హితవుపలికారు. వైద్యులు కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బుధవారం మెట్‌పల్లి, కోరుట్ల ప్రభుత్వ దవాఖానలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా మెట్‌పల్లిలో వార్డులను పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, పౌష్టికాహారంపై ఆరా తీశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఆపరేషన్ థియేటర్‌లో పెచ్చులూడుతున్న గోడలను చూసి, సూపరింటెండెంట్ సాజిత్‌కు సూచనలిచ్చారు. కాగా, ఓ రోగి పక్కనున్న నూతన భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని అడుగగా, ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. అనంతరం కోరుట్లలో డయాలసిస్ సెంటర్‌తోపాటు ప్రసూతి వార్డులను పరిశీలించి, బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న సేవలు, ఔషధాలు, మౌలిక సదుపాయాలపై సూపరింటెండెంట్ సునీతను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించి, రోగులకు శుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆయాచోట్ల మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ దవాఖానలు ప్రజలకు భరోసానిచ్చాయని చెప్పారు. ఇప్పుడు కూడా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు కూడా సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోరుట్లలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఫహీం, నగేశ్, రాజు, సంతోష్ ఉండగా, మెట్‌పల్లిలో వైద్యులు అమరేశ్వర్, రాజేశ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

జగిత్యాల, నవంబర్ 27 : పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని నీటి ప్రాజెక్టుల స్థితిగతులు, పెండింగ్ ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెల్లింపులు తదితర అంశాలపై రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయా శాఖల ఉన్నతాధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీసీకి మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బీ సత్యప్రసాద్ పాటు, అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్డీవో రఘువరన్ పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి అరెస్ట్

రాంనగర్, నవంబరు 27: తప్పుడు పత్రాలతో భూమి తన పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇతరులకు అమ్మిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన సామిండ్ల పద్మ ప్రియకు బొమ్మకల్ గ్రామ శివారులో 6 గంటల స్థలం ఉంది. ఆమె చనిపోయిన అనంతరం నగరంలో మారుతీ నగర్‌కు చెందిన పుట్టపాక శ్రీనివాస్ తప్పుడు ఓటర్ ఐడీ కార్డుతో గుర్తు తెలియని మహిళను సామిండ్ల పద్మప్రియగా చూపిస్తూ ఆరు గంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ తర్వాత ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌ని బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఏర్పాట్ల పరిశీలన

హుజూరాబాద్ టౌన్, నవంబర్27: హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 29 నుంచి డిసెంబర్ ఒకటి వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 బాల బాలికల హాకీ క్రీడా పోటీల ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా హాకీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాస్ పరిశీలించారు. పోటీల కోసం సుమారు 40 టీంలు వచ్చే అవకాశం ఉందని, ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిశీలనలో హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కబడ్డీ క్లబ్ బాధ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ హాకీ క్రీడాకారుడు చింత శ్రీనివాస్, హుజూరాబాద్ ఎస్జీఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య, పీఈటీలు వేముల రవికుమార్, రాజిరెడ్డి, మధు, సీనియర్ హాకీ క్రీడాకారుడు రమేశ్, తునికి నరేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ కిషన్ రావు ఉన్నారు.

కార్తీక వనభోజనాలు

ధర్మపురి,నవంబర్27: మండలంలోని రామయ్యపల్లి శివారులోని లక్ష్మీగణేశ్ రైస్‌మిల్ ఆధ్వర్యంలో మామిడితోటలో కార్తీకవన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనభోజనానికి వచ్చిన బ్రాహ్మణోత్తములు మొదట ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు వినోద్‌రావ్, వెంకటేశ్వరరావ్, రంగ శంకరయ్య, నాగేశ్వరరావ్, కోటయ్య, మల్లేశం ఉన్నారు.

భోజనం చేస్తున్న బ్రాహ్మణులు

కల్లెడ చెరువులో గుర్తు తెలియని మృతదేహం

జగిత్యాల రూరల్, నవంబర్ 24 : మండలంలోని కల్లెడ గ్రామ శివారు చెరువులో గుర్తు తెలియని మృతదేహం బుధవారం కనిపించింది. సుమారు 35 ఏండ్ల వయసు ఉండి, మృతదేహంపై నీలిరంగు, తెలుపు రంగు గీతల డబ్బాలున్న చొక్కా, నేవిబ్లూ రంగు నెక్కర్ ఉంది. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉంచారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్ 871265 6822ను సంప్రదించాలన్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జనగామ జిల్లా జడ్జి

మల్యాల, నవంబర్ 27: కొండగట్టు అంజన్నను దేవస్థానంలో జనగామ జిల్లా జడ్జి రవీందర్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు ఆలయ మండపంలో స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్, ఆలయ ఇన్స్పెక్టర్ అశోక్, ఏఎస్ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిని తిరుపతిని అభినందించిన ఎమ్మెల్యే

జగిత్యాల, నవంబర్ 27 : నియోజకవర్గంలోని సారంగాపూర్ మండలకేంద్రానికి చెందిన సాయిని తిరుపతి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్మెంట్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో పొలాస వ్యవసాయ కళాశాలలో డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్, డీలర్స్ కోర్సులో గోల్డ్ మెడల్ సాధించాడు. కాగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలువగా సాయిని తిరుపతిని అభినందించి శాలువాతో ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభ్యుదయ రైతు వ్యవసాయ మార్కెటింగ్ కోర్సు నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలే శంకర్, మల్లారెడ్డి, తిరుపతి, రాజేశ్వర్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, ఆరేరవి, అంజయ్య పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు వాగ్దేవి విద్యార్థులు

మల్యాల, నవంబర్ 27 : మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చూపి, జోనల్ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ నరేశ్ తెలిపారు. జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన గౌతమ్‌చారి, హాసిని, సింధును ఉపాధ్యాయబృందం అభినందించారు.